సాక్షి
ఖమ్మం
సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025



సైబర్.. టెర్రర్..

సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ మోసాలు కూడా పెరుగుతుండగా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. 8లో



...నేడు నోటిఫికేషన్

వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సోమవారం నల్లగొండ కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
36° / 17°

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయి. రాత్రి వేళ చలి ప్రభావం కూడా అంతగా ఉండదు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఉద్యోగాల్లో 'ఓపెన్' విద్యార్థులే అధికం



చక్రపాణికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఖమ్మంసహకారనగర్ : ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే వారిలో ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులే అధికమని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య ఘంటా చక్రపాణి అన్నారు. ఖమ్మం ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కళాశాల అధ్యయన కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కువ మంది చదువుకుంటున్న అధ్యయన కేంద్రాల్లో ఖమ్మం మూడో పెద్ద ప్రాంతీయ కేంద్రమని అన్నారు. రెగ్యులర్ విశ్వవిద్యాలయాల్లో లేని అరుదైన కోర్సులు ఎమ్మెస్సీ సైకాలజీ వంటివి ఓపెన్ యూనివర్సిటీలో ఉన్నాయని తెలిపారు. త్వరలో డిజిటల్ రిసోర్స్ సెంటర్, స్కిల్ డెవలప్‌మెంట్, ఒకేషనల్ కోర్సులు, డిఫెన్స్ స్టడీస్ ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఫీజు రాయితీలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మొహమద్ జాకీరుల్లా, స్టూడెంట్ సర్వీస్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ బి.వీరన్న, అధ్యాపకులు సీతారాం, లక్ష్మణరావు, సర్వేశ్వరరావు, ఎం.వి.రమణ, రమేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

ఖమ్మంసహకారనగర్ : 2024 – 25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 3 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఐఈఓ కె.రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోజుకు రెండు సెషన్ల చొప్పున పరీక్షలు ఉంటాయని, జిల్లాలో 35 కాలేజీల్లో మూడు విడతల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు. మొదటి విడతలో 3 నుండి 6 వరకు, రెండో విడత 7 నుంచి 10 వరకు, మూడో విడత 11 నుంచి 19 వరకు ఉంటాయని తెలిపారు. ఈ పరీక్షలకు 17,457 మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్షలు సీసీ కెమెరాల నిఘాలో నిర్వహిస్తామని తెలిపారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలు ప్రారంభం

- 600 మందికి పైగా హాజరు

ఖమ్మం స్పోర్ట్స్ : జాతీయ స్థాయి కరాటే పోటీలు నగరంలోని వర్తక సంఘం భవన్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి. త్రీటౌన్ సీఐ డి.రమేష్, ట్రాఫిక్ సీఐ కె.సాంబశివరావు జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు కరాటే దోహదపడుతుందని, ఈ క్రీడపై బాలబాలికలకు ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు సరైన గుర్తింపుఇవ్వడం శుభ పరిణామమని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఖమ్మంలో విరివిగా జాతీయస్థాయి కరాటే పోటీలు జరుగుతున్నాయని, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటు సర్టిఫికెట్లు, పతకాలు లభిస్తాయని చెప్పారు. గోపతి సైదులు కరాటే స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 600 మందికి పైగా కరాటే విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ బహుమతులు అందజేశారు.

ఆకు రాలితే అగ్గే !





బ్లోయర్లతో మంటలను ఆర్పుతున్న సిబ్బంది (ఇన్‌సెట్) చెత్తను కాల్చగా ఏర్పడిన ఫైర్‌లైన్ (ఫైల్)

అప్రమత్తతతోనే అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణ

- ఫైర్‌లైన్స్‌తో కట్టడికి కృషి
- ప్రత్యేక కార్యాచరణ చేపట్టిన అటవీ శాఖ

సత్తుపల్లిటౌన్: ప్రస్తుతం అడవుల్లో చెట్ల ఆకులు రాలే సీజన్. కిందపడిన ఆకులు ఎండిపోవడంతో పాటు కుప్పలుగా కనిపిస్తుంటాయి. ఈ పరిస్థితుల్లో వాటిపై నిప్పు పడితే కార్చిచ్చు వ్యాపించే ప్రమాదం ఉంటుంది. తద్వారా వన సంపదతో పాటు వన్యప్రాణులకూ ముప్పు తప్పదు. జాగ్రత్తలు తీసుకుంటేనే ఈ విపత్తును నివారించవచ్చని భావిస్తున్న అటవీ శాఖ అధికారులు.. జిల్లాలోని అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా అవగాహన కార్యక్రమాలతో పాటు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు.

637.135 చ.కి.మీ.మేర అడవులు..

జిల్లా మొత్తం విస్తీర్ణం 4,360 చదరపు కిలోమీటర్లు కాగా, ఇందులో ఖమ్మం, మధిర, కారేపల్లి, కూసుమంచి, సత్తుపల్లి, తల్లాడ డివిజన్ల పరిధిలో 637.135 చదరపు కిలోమీటర్ల మేర అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల్లో ఎక్కువగా టేకు, మేడి, ఇప్ప తదితర చెట్లు ఉండగా, ఆకులు రాలి ఎండిపోయాయి. వాహనాల్లో వెళ్తున్న వారు సిగరెట్, బీడీలు తాగి.. పూర్తిగా ఆర్పకుండానే రోడ్డు పక్కనున్న అడవుల్లోకి విసురుతుంటారు. పశువుల కాపరులు, అడవుల్లోకి ప్రవేశించే ఇతర వ్యక్తులు సైతం చుట్ట, బీడీ, సిగరెట్లు, కాల్చిన అగ్గిపుల్లలు అలాగే నిర్లక్ష్యంగా పడేస్తుంటారు. తద్వారా ఆకులు కాలి మంటలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉంటుంది.

ఫైర్‌లైన్స్‌తో కట్టడి..

వేసవిలో చెట్ల ఆకులు రాలడంతో చిన్నపాటి నిప్పురవ్వ పడినా అడవి దావానలంలా అంటుకుంటుంది. ఇలాంటి నష్టం జరగకుండా అటవీ శాఖ అధికారులు అడవుల్లో ఫైర్‌లైన్స్‌తో అగ్ని ప్రమాదాలను కట్టడి చేస్తున్నారు. అడవిలో పడిన ఆకులను బ్లోయర్ల సహాయంతో దూరం చేయడంతో నిప్పు అంటుకున్నా మంటలు విస్తరించవు. నేల రాలిన చెట్ల ఆకులను ఒకచోట పోగు చేసి కిలోమీటర్ పొడవున మంట పెడుతున్నారు. దీంతో నల్లటి రంగుతో సరిహద్దు గీత ఏర్పడి వన్యప్రాణులు సైతం అడవి దాటి బయటకు వెళ్లకుండా ఫైర్‌లైన్స్ ఉపయోగపడతాయి.

శాటిలైట్ సహాయంతో..

రాత్రింబవళ్లు ఎక్కడ అగ్గి రాజుకున్నా శాటిలైట్ సాయంతో ప్రమాదాన్ని గుర్తించే అవకాశం ఉంటుంది. ఆ ప్రాంత అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించే వీలు కలుగుతుంది. దాని ఆధారంగా సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పుతారు. అగ్గి అంటుకున్న వెంటనే ఆర్పేందుకు వీలుగా క్విక్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. అటవీ సమీప గ్రామాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

నిప్పు పెడితే కఠిన చర్యలు



ఎవరైనా అడవిలో నిప్పు పెట్టినట్లు తేలితే వారిపై అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. అడవులు అగ్ని ప్రమాదాల బారిన పడకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాం. ఫైర్‌లైన్స్ ఏర్పాటుతో ఒకచోట నుంచి మరో చోటకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– వి.మంజుల, ఎఫ్‌డీఓ, సత్తుపల్లి

నిరంతరం గస్తీ..



అటవీ పరిరక్షణకు గస్తీ ముమ్మరం చేశాం. క్షేత్ర స్థాయిలో అటవీశాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాం. ఆకతాయిలు, పశువుల కాపరులు, ఇతరులు అడవుల్లోకి అగ్గి పెట్టెలు తీసుకుపోకుండా అవగాహన కల్పిస్తున్నాం. అగ్ని ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నాం.

– పి.స్నేహలత, రేంజర్, సత్తుపల్లి

ఖమ్మం డివిజన్ అటవీ విస్తీర్ణం	సత్తుపల్లి డివిజన్ అటవీ విస్తీర్ణం	మొత్తం రేంజ్‌లు	అటవీ సెక్షన్లు	ఫారెస్ట్ బీట్లు	ఫైర్‌లైన్స్
30,888.960 హెక్టార్లు	33,052.940 హెక్టార్లు	8	33	114	197.63 కి.మీ.

క్రీడలతో మానసికోల్లాసం

ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి ఉమాదేవి




గెలుపొందిన ఖమ్మం జట్టుతో న్యాయమూర్తులు

ఖమ్మం లీగల్: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెరుగుతుందని ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి ఉమాదేవి అన్నారు. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి మహిళా న్యాయవాదుల క్రీడా పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. క్రీడా పోటీల్లో వివిధ జిల్లాల నుంచి మహిళా న్యాయవాదులు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. గెలుపోటముల కంటే క్రీడల్లో పాల్గొనడమే ముఖ్యమని అన్నారు. ఖమ్మంలో రాష్ట్ర స్థాయి మహిళా న్యాయవాదుల క్రీడా పోటీలు నిర్వహించిన తాళ్లూరి దిలీప్ చౌదరిని అభినందించారు. అనంతరం న్యాయమూర్తులు అర్చనకుమారి, రాంప్రసాద్, శ్రీనయ్య మాట్లాడుతూ.. క్రీడలతో మానవ సంబంధాలు మెరుగుపడతాయని, నిత్యం కేసులతో బిజీగా ఉండే న్యాయవాదులకు ఉత్సాహాన్ని కలిగిస్తాయని అన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శివరంజని, ఎం.కల్పన, చంద్రశేఖర రావు, దీప, మాధవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఫెడరేషన్ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు దిర్శాల కృష్ణారావు, అడ్వకేట్ జేఏసీ నాయకులు బిచ్చాల తిరుమలరావు, పసుపులేటి శ్రీనివాస్, టోర్నీ ఆర్గనైజర్ రావుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

టమాట.. ఢమాల్

పడిపోయిన ధర.. రూ.10కే కిలో

- రైతుకు దండగ.. వినియోగదారులకు పండగ
- స్థానికంగా పంట ఉత్పత్తి అధికం కావడంతో ధరలకు కళ్లెం



ఖమ్మంవ్యవసాయం: టమాట ధర బాగా తగ్గింది. ప్రభుత్వ మార్కెట్లు, రైతు బజార్లలో కిలో రూ.16గా బోర్డులపై రాసినా రైతులు రూ.10కే విక్రయిస్తున్నారు. ప్రస్తుతం టమాట పంట సీజన్ కావడంతో ధరపై తీవ్ర ప్రభావం పడింది. స్థానికంగా డిమాండ్ కంటే ఉత్పత్తి అధికం కావడంతో ధర పడిపోయింది. ఇటీవలి కాలంలో టమాటకు ధర భారీగా ఉండడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ పంట సాగుకు రైతులు ప్రాధాన్యం ఇచ్చారు. సాధారణంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుజాతనగర్, జూలూరుపాడు, ఏన్కూరు, రఘునాథపాలెం, కొణిజర్ల, చింతకాని, బోనకల్, కల్లూరు, తల్లాడ, ఎర్రుపాలెం, ముదిగొండ, ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్, టేకులపల్లి, ఇల్లెందు, బూర్గంపాడు, చంద్రుగొండ, కామేపల్లి, కారేపల్లి మండలాల్లో కూరగాయల పంటల సాగులో భాగంగా రైతులు టమాటా సాగు చేస్తుంటారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన అధిక వర్షాలతో పంటలు దెబ్బతినడంతో టమాటకు అధిక ధర పలికింది. యాసంగి పంటగా నవంబర్, డిసెంబర్ నెలల్లో సాగు చేసిన పంట ప్రస్తుతం దిగుబడి వస్తోంది. ఉమ్మడి జిల్లాలో సుజాతనగర్, జూలూరుపాడు మండలాల్లో రైతులు ఎకరాల కొద్దీ టమాట పంట సాగు చేస్తుంటారు. ఇక్కడ సాగు చేసే టమాట రాజమండ్రి, విశాఖపట్నం, విజయవాడ, వరంగల్, ఖమ్మం, హైదరాబాద్ హోల్‌సేల్ మార్కెట్లలో విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ఆయా రైతులతో పాటు కొద్ది విస్తీర్ణంలో సాగు చేసిన రైతులు హోల్‌సేల్ మార్కెట్లలో, నేరుగా రిటైల్‌గా కూడా విక్రయిస్తున్నారు.

గతేడాది జనవరితో పోలిస్తే సగం ధరే..

గత ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో టమాట ధర రూ.20 పలికింది. ప్రస్తుతం రూ.10కే విక్రయిస్తున్నారు. అంటే గత జనవరి, ఫిబ్రవరి నెలలతో పోలిస్తే సగానికి సగం ధర పడిపోయింది. సాగు విస్తీర్ణం పెరగడం, పంట ఉత్పత్తి ఉండడంతో ధర బాగా తగ్గింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దాదాపు 2వేల ఎకరాలకు పైగా టమాట సాగు చేసినట్లు ఉద్యాన అధికారులు చెబుతున్నారు. దీనికి తోడు పొరుగు జిల్లాలు, ఏపీ నుంచి టమాట ఖమ్మం హోల్‌సేల్ మార్కెట్‌కు దిగుమతి అవుతోంది. దీంతో ధర గణనీయంగా తగ్గిందని ఉద్యాన అధికారులు విశ్లేషిస్తున్నారు.

రూ.100 నుంచి రూ.10కి..

ఈ ఏడాది టమాట ధర ఒక దశలో కిలో రూ.100కు కూడా విక్రయించగా ప్రస్తుతం రూ.10కి పడిపోయింది. గత జూన్‌లో టమాట ధర బాగా పెరిగింది. హోల్‌సేల్ మార్కెట్లలో రూ.80, రిటైల్ మార్కెట్లలో రూ.100 నుంచి 120 వరకు కూడా విక్రయించారు. ఇక్కడ పంట ఉత్పత్తి ఆశించిన విధంగా లేకపోవడంతో మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలతో పాటు ఏపీలోని చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి దిగుమతి చేసుకుని విక్రయించారు. ఖమ్మం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో నిత్యం వ్యాపారులు 300 టన్నుల టమాటను దిగుమతి చేసుకొని ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ, ఏపీలోని జగ్గయ్యపేట, నందిగామ తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తుంటారు. రూ.100 ధర పలికిన కాలంలో దిగుమతి 100 టన్నులకు పడిపోయింది.

వినియోగదారులకు ఊరట..

ప్రస్తుత సీజన్‌లో టమాట పంట రైతుకు దండగ కాగా, వినియోగదారులకు మాత్రం పండగ అని చెప్పవచ్చు. టమాట కిలో రూ.20 వరకు ధర పలికితే రైతులకు గిట్టుబాటవుతుంది. అయితే ప్రస్తుతం అందులో సగం ధర మాత్రమే ఉంది. దీంతో టమాట రైతుకు పంట సాగు దండుగ కాగా, వినియోగదారులకు మాత్రం ఊరట లభిస్తోంది. ఒకప్పుడు అర కిలో కొనుగోలు చేసిన వినియోగదారులు.. ప్రస్తుతం 2 కిలోల వరకు కూడా కొనుగోలు చేస్తున్నారు. ప్రతీ కూరలో టమాటా వినియోగించే అవకాశం ఉండడంతో వినియోగదారులు కొనుగోళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

శివరాత్రి వరకు పనులు పూర్తి చేయాలి



లక్ష్మీపురంలో ఆలయ అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న భట్టి విక్రమార్క

- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం
- రామలింగేశ్వర స్వామి ఆలయంలో పనుల పరిశీలన

వైరా: మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామంలో గల శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి పనులను శివరాత్రి నాటికి పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆలయంలో రూ. 3.20 కోట్ల వ్యయంతో అభిషేక మండపం, కల్యాణ మండపం, వేదిక, కాటేజీలు, టాయ్‌లెట్స్ నిర్మాణాలు చేస్తుండగా పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన పనుల పురోగతిని ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ.. శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. భట్టి వెంట వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు నాయుడు సత్యనారాయణ, రాయల నాగేశ్వరరావు, నూతి సత్యనారాయణ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి శ్రీను, దాసరి దానియేలు, పమ్మి అశోక్, బొర్ల గంగారావు తదితరులు ఉన్నారు.

రామదాసు మందిరాన్ని అభివృద్ధి చేస్తా

- రూ.2.65 కోట్ల మంజూరుకు కృషి
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



రామదాసు మందిరంలో పూజలు చేస్తున్న మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి : భక్త రామదాసు మందిరాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకునేలా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రామదాసు జయంతి ఉత్సవాల సందర్భంగా స్థానిక ధ్యాన మందిరంలో నిర్వహించిన వేడుకల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆవరణలోని రామదాసు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భక్త రామదాసు అనేక కష్టాలు పడి భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని నిర్మించారని, అలాంటి మహనీయుడు జిల్లాలో జన్మించడం ఇక్కడి వారి అదృష్టమని అన్నారు. ప్రతి సంవత్సరం రామదాసు జన్మస్థలమైన నేలకొండపల్లిలో జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. అతి త్వరలోనే ప్రభుత్వం నుంచి రూ.2.65 కోట్ల నిధులు మంజూరు చేయించి ధ్యాన మందిర అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతామని ప్రకటించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, మాజీ ఎంపీపీ వజ్జా రమ్య, స్థానిక నాయకులు శాఖమూరి రమేష్, భద్రయ్య, బొడ్డు బొందయ్య, మామిడి వెంకన్న, వంగవీటి నాగేశ్వరరావు, రాయపూడి నవీన్, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, మైశా శంకర్, గుండా బ్రహ్మం, మామిడి సుభద్ర, కైలాసపు వెంకటేశ్వర్లు, కడియాల నరేష్, జెర్రిపోతుల సత్యనారాయణ, మోర మల్లయ్య పాల్గొన్నారు.

టీమ్ ఇండియాకు అభినందన

ఖమ్మంవన్‌టౌన్: మహిళల అండర్–19 టీ ట్వంటీ వరల్డ్ కప్ పోటీల్లో సౌత్ ఆఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించిన టీం ఇండియా మహిళల జట్టుకు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందనలు తెలుపుతూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫైనల్ మ్యాచ్‌లో బ్యాటింగ్‌లోనూ, బౌలింగ్‌లోనూ రాణించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన భద్రాచలం క్రీడాకారిణి గొంగడి త్రిషను రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గర్వకారణమన్నారు.

ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలి

- 10 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులకు ఆర్థిక సాయం
- ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ



విద్యార్థిని సన్మానిస్తున్న సత్యనారాయణ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్/వేంసూరు : పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు ప్రణాళిక ప్రకారం సన్నద్ధం కావాలని ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ అన్నారు. నగరంలోని కేఎండీసీ కళాశాల, వేంసూరులోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఆదివారం నిర్వహించిన ప్రేరణ, భవిష్యత్ మార్గదర్శక తరగతుల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని వసతిగృహ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించాలని సూచించారు. 10 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులకు ఎస్సీ సంక్షేమ శాఖ తరుపున ఆర్థిక సాయం అందిస్తామని, కార్పొరేట్ కళాశాల పథకంలో ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. అనంతరం చెకుముఖి టాలెంట్ టెస్ట్‌లో జిల్లా మొదటి బహుమతి సాధించిన విద్యార్థి వై.హర్షవర్ధన్‌ను సత్కరించారు. ఖమ్మంలో 169 మంది, వేంసూరులో జరిగిన తరగతులకు కామేపల్లి, ఏన్కూరు, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాలకు చెందిన 165 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో సత్తుపల్లి ఏఎస్ సీడీఓపీ లక్ష్మీనారాయణ, ఖమ్మం డివిజన్ సంక్షేమాధికారి అబ్దుల్ రవూఫ్, వసతిగృహ సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు, భాస్కరరావు, నాగుల్‌మీరా, రంజిత్‌కుమార్, శోభన్‌బాబు, చంద్రశేఖర్, తాళ్లూరి సృజన్‌కుమార్, వసతిగృహ సంక్షేమాధికారులు ఎం.ఝాన్సీరాణి, కె.మురహరి, ఎస్.విజయ, జి.వినోద, టి.స్టాలిన్, వై.మల్లారెడ్డి, ఎస్.వెంకటరెడ్డి, కృష్ణ, కె.సుశీల, బి.వెంకటేశ్వరరావు, జి.వేణు, దర్గాబీ, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడాలి

- బీఆర్ఎస్ కార్యకర్తల చేతుల్లో పింక్ డైరీ ఉండాలి
- డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో మాజీ మంత్రి పువ్వాడ



డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్ : బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల చేతుల్లో ఇకపై పింక్ డైరీ ఉండాలని, ప్రజల్లో తిరుగుతూ వారి సమస్యలపై పోరాడాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని మమత ఆస్పత్రిలో గల క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి పెట్టిన సర్వే వారికే దెబ్బకొట్టిందన్నారు. సంవత్సర కాలంలో పథకాలు అమలు చేయకుండా నిత్యం కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. తెలంగాణను దేశంలో నంబర్ వన్‌గా నిలబెట్టిన ఘనత కేసీఆర్‌దని అన్నారు. పరిపాలన అంటే నిర్మాణాలు చేపట్టాలని, కానీ రేవంత్ పాలన కూల్చివేతలతో కొనసాగుతోందని ఎద్దేవా చేశారు. జనవరి 26 నుంచి రైతు భరోసా 'టకి టకి'మంటూ పడుతుందని ప్రకటించారని, కానీ నేటికీ రైతుల ఖాతాల్లో జమ కాలేదని అన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాల వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విమర్శించారు. కార్యకర్తలకు కేసీఆర్, కేటీఆర్, తాను, పార్టీ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆర్‌జేసీ కృష్ణ, టేకులపల్లి సొసైటీ చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బూల్, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు తాజుద్దీన్, మహిళా అధ్యక్షురాలు కొల్లు పద్మ, కార్పొరేటర్లు నాగండ్ల కోటి, పసుమర్తి రామ్మోహన్, బుడిగం శ్రీనివాస్, పల్లా రోజ్‌లీనా, అమృత, చిరుమామిళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్పెషల్ పార్టీ సిబ్బంది ట్రాఫిక్‌కు అటాచ్‌మెంట్

ఖమ్మంక్రైం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో స్పెషల్ పార్టీలో విధులు నిర్వర్తిస్తున్న 16 మంది సిబ్బందిని ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు అటాచ్‌మెంట్ చేస్తూ సీపీ సునీల్‌దత్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ పార్టీలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు సివిల్ హెడ్‌కానిస్టేబుళ్లు, ఏఆర్ విభాగం హెడ్‌కానిస్టేబుళ్లు నలుగురు, పది మంది కానిస్టేబుళ్లను ట్రాఫిక్ విభాగానికి అటాచ్‌మెంట్ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

వైరస్‌తో కోళ్లు మృత్యువాత



వైరస్ సోకిన కోళ్లు

కల్లూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లోని కోళ్ల ఫారాల్లో కోళ్లకు వైరస్ సోకి సుమారు 50 వేల కోళ్లు మృతిచెందాయి. సుమారు రూ.35 లక్షల వరకు నష్టం జరిగిందని భావిస్తున్నారు. మండలంలోని పాయపూరు, యజ్ఞనారాయణపురం, పెద్దకోరుకొండి, వెన్నవెల్లి, పేరువంచ, నారాయణపురం, కొర్లగూడెం, కల్లూరులలోని కోళ్ల ఫారాల్లో కోళ్లు పెంచుతున్నారు. గాలి నుంచి సోకిన వైరస్ వల్ల బ్రాయిలర్‌తోపాటు నాటు కోళ్లు కూడా మృత్యువాత పడుతున్నట్లు చెబుతున్నారు. రూ.లక్షలు పెట్టుబడి పెడితే అపార నష్టం సంభవించిందని కోళ్ల ఫారం యజమానులు లక్ష్మీనరసింహారావు, భూక్యా శివ, కృష్ణ వాపోయారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలోని పెట్రోల్‌బంక్ సమీపంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లోకి ప్రవేశించిన గుర్తుతెలియని దుండగులు బంగారు ఆభరణాలు, సిగరెట్ డబ్బాలు ఎత్తుకెళ్లిన ఘటనపై ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లింగంపల్లి ఉపేందర్ కిరాణా దుకాణాలకు సిగరెట్లతో పాటు ఇతర సరుకులు సరఫరా చేస్తుంటాడు. గత నెల 30న ఖమ్మంలోని బంధువుల ఇంట్లో గృహప్రవేశం ఉందని వెళ్లాడు. ఆదివారం ఇంటికి వచ్చి చూడగా ఇంటి వెనుక తాళాలు పగులగొట్టి బీరువాలోని తులం చైన్, ఆరు గ్రాముల చెవి దిద్దులు, రూ.50 వేల విలువైన సిగరెట్ డబ్బాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యపై కేసు నమోదు

తిరుమలాయపాలెం: మండలంలోని ఇస్లావత్ తండాకు చెందిన ఓ యువకుడు మూర్ఛవ్యాధితో బాధపడుతూ మనస్తాపానికి గురై పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తండాకు చెందిన ఇస్లావత్ ప్రసాద్(17)కు మూర్ఛవ్యాధి ఉంది. గత నెల 29న పురుగులమందు తాగగా కుటుంబసభ్యులు మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తల్లితండ్రులు కూడా గతంలోనే మృతిచెందారు. మృతుడి అన్న ఇస్లావత్ సాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

☛ **జిల్లాలో** ఉన్న ఓ వైద్యుడికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి 'మేం ఢిల్లీ సెంట్రల్ ఇంటెలిజెన్స్ నుంచి మాట్లాడుతున్నామని, మీ ఫోన్ ద్వారా ఉగ్రవాదులకు కాల్స్ వెళ్తున్నాయని, మిమ్మల్ని అరెస్ట్ చేయడానికి వస్తున్నా'మని చెప్పాడు. వెంటనే వీడియో కాల్ ద్వారా మరో ఇద్దరు మాట్లాడుతూ.. తాము సెంట్రల్ ఇంటెలిజెన్స్ విభాగమని, మీరు ఉగ్రవాదులకు ఫోన్‌లో సంప్రదింపులు జరుపుతున్నట్లు తేలిందని, వెంటనే అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపుతామని చెప్పారు. తమకు డబ్బు కావాలని అడగ్గా.. వారితో మాట్లాడుతూనే వైద్యుడు మరో ఫోన్‌లో తమకు తెలిసిన సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాడు. వారు ఆ నంబర్‌ను పరిశీలించి.. సైబర్ నేరగాళ్ల నుంచి వచ్చినట్లు నిర్ధారించారు. వెంటనే ఆ వైద్యుడు ఫోన్ కట్ చేసి సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశాడు.

సైబర్.. టెర్రర్

నేరాల్లో నిందితుల కొత్తకోణం

- అమాయకులే లక్ష్యంగా ఎత్తుగడలు
- నమ్మకంగా చెప్పే మాటలు, బెదిరింపులతో మోసపోతున్న జనం
- అధికారులు అవగాహన కల్పిస్తున్నా అదే పరిస్థితి



ఖమ్మంక్రైం: సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లకు అవకాశాలు పెరుగుతున్నాయి. మరోవైపు ఇన్ని మోసాలు జరుగుతున్నా.. ప్రజల్లో మాత్రం ఇంకా మార్పు రావడం లేదు. రుణం వస్తుంది, లాటరీ వచ్చింది అంటే అమాయకంగా సైబర్ నేరగాళ్ల మాయలో పడుతున్నారు. ప్రస్తుతం వీరు సరికొత్త దారులను ఎంచుకుని మోసాలకు పాల్పడుతున్నారు. లాటరీలో డబ్బులు వచ్చాయని, సెంట్రల్ క్రైమ్ పోలీస్ స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని చెబుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఉగ్రవాదులకు సాయం చేస్తున్నారని, ఎయిర్‌పోర్ట్‌లో మీ పేరుతో ఉన్న పార్శిల్‌లో డ్రగ్స్ దొరికాయని ఇలా చెబుతూ దందాకు పాల్పడుతున్నారు. కొందరు తెలివిగా ఇది సైబర్ నేరగాళ్ల పని అని తెలుసుకుంటుండగా.. మరికొందరు మాత్రం వారి మాయ మాటలకు బలైపోతున్నారు.

కొత్త దారులు వెదుక్కుంటూ..

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ స్మార్ట్‌ఫోన్‌లను వినియోగిస్తున్నారు. చాలామందికి సైబర్‌నేరాల పట్ల అవగాహన కలుగుతోంది. ఈ నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు కొత్త దారులను ఎంచుకుంటున్నారు. ఇందుకు లాటరీలు, రుణాలను ఆయుధాలుగా చేసుకుంటున్నారు. డబ్బు అవసరం ఉన్నవారు, సైబర్ నేరాల గురించి అవగాహన లేని వారు వీరి బారిన పడుతున్నారు. మరోవైపు నేరాలకు పాల్పడ్డారని బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఆ నేరం తాము చేయలేదని తెలిసినా సైబర్ నేరగాళ్ల మాటలకు అమాయకులు హడలిపోతున్నారు. తమ వద్ద ఉన్న డబ్బు పోగొట్టుకుంటున్నారు.

గత నెలలోనే 10 కేసులు..

గత నెలలో జిల్లావ్యాప్తంగా 10 సైబర్ క్రైమ్‌లు నమోదయ్యాయి. రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నష్టం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఇక సైబర్ నేరగాళ్ల బారిన పడి ఫిర్యాదులు చేయకుండా ఉన్నవారు కూడా ఉన్నారు. గత ఏడాది రూ.34 కోట్లకు పైగా సైబర్ నేరగాళ్ల ద్వారా ప్రజలు డబ్బులు పోగొట్టుకున్నారు. 2,148 కేసులు అయిన విషయం విదితమే.

☛ **సత్తుపల్లి** ప్రాంతంలో డబ్బా కొట్టు నిర్వహిస్తున్న ఓ కిరాణా వ్యాపారికి ఫోన్ వచ్చింది. తాము తెలంగాణ ప్రభుత్వ శాఖ నుంచి మాట్లాడుతున్నామని, మీకు ఆరోగ్య భద్రత కింద రూ.15 వేలు మంజూరయ్యాయని, వాటిని అకౌంట్‌కు పంపుతామని, ఫోన్‌పే నెంబర్ చెప్పమని అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేశాడు. సదరు డబ్బా కొట్టు వ్యాపారి తనకు ఫోన్‌పే, గూగుల్‌పే లేవని తెలిపారు. అయితే మీకు సంబంధించిన వారికైనా పంపుతామని చెప్పడంతో తన సోదరుడు ఫోన్‌పే, గూగుల్‌పే వాడతాడని, ఆయనతో మాట్లాడమని సెల్ కాన్ఫరెన్స్ కలిపారు. దీంతో అవతలి వ్యక్తి ఫోన్‌పే, గూగుల్‌పే నంబర్లతో పాటు యూపీఐ నబర్, అన్ని వివరాలు అడిగాడు. ఐదు నిమిషాల్లో డబ్బులు పడిపోతాయంటూ ఫోన్ కట్ చేశాడు. కాసేపట్లో కొట్టు యజమాని సోదరుడి అకౌంట్‌లో ఉన్న రూ.35 వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. బ్యాంక్‌కు వెళ్లగా అకౌంట్‌లో ఉన్న డబ్బు డెబిట్ అయిందని చెప్పారు. దీంతో అవాక్కయిన వ్యక్తి వెంటనే తమకు ఫోన్ చేసిన నంబర్‌కు కాల్ చేయగా స్విచాఫ్ అయింది. జరిగిన మోసం అర్థమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఆశ, అత్యాశలే సైబర్ నేరగాళ్ల ఆయుధాలు..



మన ఆశ, అత్యాశలను సైబర్ నేరగాళ్లు ఉపయోగించుకుంటున్నారు. నిత్యం వాడే సోషల్ మీడియాకు సంబంధించి ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్, ఈమెయిల్ ద్వారా దృష్టిని ఆకర్షించి వాటి ద్వారా సైబర్ నేరగాళ్లు గాలం వేస్తుంటారు. ఎట్టి పరిస్థితుల్లో వారి మాయలకు ఆకర్షితులు కావద్దు. ఒకవేళ మోసపోతే వెంటనే సైబర్ క్రైమ్‌కు సంబంధించి 1930 నెంబర్‌కు కాని, www.cybercrime.gov.in లో కాని సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయాలన్నారు.

– ఫణీందర్, డీఎస్పీ, సైబర్ సెక్యూరిటీ

మధిర స్విమ్మర్స్ సత్తా

మధిర: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్ద ఆక్వా డెవిల్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కృష్ణా రివర్ క్రాసింగ్ పోటీల్లో మధిర స్విమ్మర్స్ సత్తా చాటారు. ప్రకాశం బ్యారేజ్ ఎగువన దుర్గా ఘాట్ వద్ద జరిగిన 25వ జాతీయ స్థాయి కృష్ణా రివర్ క్రాసింగ్ పోటీల్లో మధిర అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆరుగురు స్విమ్మర్లు పాల్గొన్నారు. కృష్ణా రివర్ 1.5 కిలోమీటర్ల దూరాన్ని విజయవంతంగా క్రాసింగ్ చేశారు. మధిర స్విమ్మర్స్ అసోసియేషన్‌లో అతి చిన్న వయసులో ఆవుల శాన్వి (12) 31.25 నిమిషాల్లో కృష్ణా రివర్ క్రాసింగ్ చేసి రికార్డు సృష్టించింది. పోటీలకు వెళ్లిన స్విమ్మర్లలో ఈర్ల శ్రీశైలం, ఆవుల సంతోష్ కుమార్, చొక్కా రాంబాబు, ఊటుకూరు భాస్కరరావు, అబ్దుల్ హనీఫ్ విజయవంతంగా కృష్ణా రివర్‌ను క్రాసింగ్ చేసి నైపుణ్యాన్ని ప్రదర్శించి నిర్వాహకుల నుంచి ప్రశంసాపత్రాలు పొందారు. వారికి మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ బాధ్యులు, సభ్యులు అభినందనలు తెలిపారు.



ప్రశంసా పత్రాలు చూపిస్తున్న శ్రీనివాస్

ఆరోపణలు.. ప్రతి సవాళ్లు..



వేంసూరు పోలీస్‌స్టేషన్‌లో వెంకటవీరయ్య



సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో కార్యకర్తలతో మట్టా దయానంద్

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం
- అంబేడ్కర్ విగ్రహం వద్ద పోలీసుల మోహరింపు

సత్తుపల్లి/వేంసూరు: అధికార కాంగ్రెస్ సవాల్.. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ సవాల్‌ను స్వీకరించటంతో అయా పార్టీల నేతలు అరెస్ట్ అయ్యేవరకు వెళ్లింది. సత్తుపల్లి నియోజకవర్గంలో డీ-ట్యాక్స్ వసూళ్లు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆరోపణలు చేయడం, దమ్ముంటే అంబేడ్కర్ బొమ్మవద్ద అవినీతిపై చర్చకు రండి అని అధికార కాంగ్రెస్ పార్టీ సవాల్ విసరటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజాము నుంచే బీఆర్‌ఎస్ నేతలను అరెస్ట చేసి వేంసూరు పోలీస్ స్టేషన్‌కు, కాంగ్రెస్ పార్టీ నేతలను అరెస్ట్ చేసి సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత మట్టా దయానంద్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌లో ఉన్నప్పుడే సీఎం కేసీఆర్‌ను అడిగానని, మీ వద్ద ఉన్న వారంతా బుకీలు, పేకాట, కోడి పందేలు, మద్యం, గంజాయి, బెట్టింగ్‌ల నుంచి ట్యాక్స్‌లు వసూళ్లు చేశారని ఆరోపించారు. ఈ ట్యాక్స్‌లతోనే మీ బతుకంతా గడిచిపోయిందని మండిపడ్డారు. సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. గంజాయి అమ్ముతూ ఎవరికొడుకు పట్టుబడ్డారో.. గంగారం కోడి పందాలు వేస్తే ఏ నాయకుడిపై కేసు అయిందో.. ఇలా పూర్తిగా చెప్పుకుంటూ పోతే తట్టుకోలేరని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీగా సమస్యలపై నిలదీస్తామని.. వాళ్లే సవాల్ విసిరి, పోలీసులతో అరెస్టులు చేయించటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, అంబేడ్కర్ విగ్రహం వద్ద కల్లూరు ఏసీపీ రఘు పర్యవేక్షణలో సత్తుపల్లి పట్టణ, రూరల్ సీఐలు టి.కిరణ్, ముత్తిలింగం, ఎస్‌ఐలతో భారీగా పోలీసులను మోహరించారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

ఏన్కూరు: కోడి పందేల స్థావరాలపై పోలీసులు దాడి చేసిన ఘటన మండలంలోని జన్నారంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జన్నారం గ్రామ సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఆరుగురు వ్యక్తులు, రూ.25 వేల నగదు, 18 ద్విచక్ర వాహనాలు, కత్తులను స్వాధీనం చేసుకున్నారు. మరి కొందరు పరారయ్యారు. స్వాధీనం చేసుకున్న వాహనాలు, వ్యక్తులను ఏన్కూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు నేడు నోటిఫికేషన్

- నేటి నుంచి 10వ తేదీ వరకు వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ
- నల్లగొండలోని కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్లను నల్లగొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ కార్యాలయంలో స్వీకరించనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కలెక్టరేట్ వద్ద బారికేడ్లు

ఈనెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణకు అవకాశం ఉంటుంది. 11న నామినేషన్లు పరిశీలిస్తారు. 13న సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. ఆ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటిస్తారు. 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్, మార్చి 3వ తేదీన ఓట్లు లెక్కిస్తారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే నల్లగొండ కలెక్టరేట్ బయట 100 మీటర్ల పరిధిలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. 100 మీటర్లలోపు మూడు వాహనాలు, నామినేషన్ వేసే అభ్యర్థితో కలిపి ఐదుగురిని మాత్రమే అనుమతించనున్నారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు..

నామినేషన్లు సమర్పించేందుకు వచ్చే అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకుగాను నామినేషన్ల స్వీకరణ హాల్ ముందు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. నామినేషన్లు నింపడంలో ఎలాంటి సందేహాలున్నా అక్కడి సిబ్బంది ద్వారా నివృత్తి చేసుకోవచ్చు. నామినేషన్లు నింపుకుని వచ్చిన అభ్యర్థులు నిబంధనలకు అనుగుణంగా అన్నీ ఉన్నాయా.. ఇంకా ఏవైనా పూర్తి చేయాలా.. ఏవైనా సర్టిఫికెట్లు జత చేయాలా తదితర వివరాలను తెలుసుకునేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. నామినేషన్ సమర్పించేందుకు ఎక్కువ మంది ఒకేసారి వస్తే ఇబ్బంది కలుగకుండా వెయిటింగ్ హాల్ కూడా ఏర్పాటు చేశారు.

నిబంధనలు ఇలా..

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్లు సమర్పించే వారు జనరల్ అభ్యర్థి అయితే రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలైతే రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలి.
- ఎమ్మెల్సీకి పోటీ చేసే వ్యక్తి తెలంగాణలో జనరల్ ఓటరై ఉండాలి. రాష్ట్రంలోని ఏ జిల్లాల్లో కూడా ఓటు హక్కు లేకపోతే పోటీకి అనర్హుడు.
- నామినేషన్ సమర్పించే అభ్యర్థికి పది మంది ప్రపోజల్స్ సంతకాలు చేయాల్సి ఉంటుంది. వారంతా వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఈ మూడు జిల్లాల పరిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరై ఉండాలి.

చానెల్ రిపోర్టర్‌పై కేసు

రఘునాథపాలెం: ఓ టీవీ చానెల్ రిపోర్టర్‌పై రఘునాథపాలెం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఉస్మాన్‌షరీఫ్ కథనం ప్రకారం.. గత నెల 27న పువ్వాడనగర్ పరిధిలోని గుట్ట వద్ద నేషనల్ హైవే రోడ్డు కోసం ప్రభుత్వ అనుమతితో మట్టి తరలిస్తున్నారు. ఓ చానెల్ రిపోర్టర్ అక్కడికి వచ్చి, వారిని బెదిరించడంతో సైట్ ఇంజనీర్ దారగాని పాపారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చానెల్ రిపోర్టర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ఖమ్మంక్రైం : ఘర్షణ పడిన ఇరువర్గాలపై ఖమ్మం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసులు నమోదయ్యాయి. అంకి పుల్లయ్య, అనుమల యశోద కటుంబాల మధ్య ప్రహరీ, సెప్టిక్ ట్యాంక్ అంశంపై వివాదం న్యాయస్థానంలో ఉంది. ఈ క్రమంలో సెప్టిక్‌ట్యాంక్‌ను పుల్లయ్య శుభ్రం చేయిస్తుండగా యశోద కుటుంబసభ్యులు అభ్యంతరం తెలిపారు. దీంతో ఇరు వర్గాలు ఘర్షణ పడి కొట్టుకోన్నారు. దీనిపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మణుగూరుటౌన్: లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో లారీ కింద పడి యువకుడు మృతి చెందిన ఘటన మణుగూరులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని కాళీమాత ఏరియాకు చెందిన రావుల ప్రదీప్ (29) మణుగూరులోని కారు షోరూంలో పనిచేస్తున్నాడు. రాత్రి బంధువుతో పట్టణంలో పని నిమిత్తం వచ్చి మోటార్ సైకిల్‌పై వెనుక కూర్చుని ఇద్దరూ గుట్టమల్లారం మీదుగా కమలాపురం వెళ్తున్నారు. ఈ క్రమంలో మణుగూరు నుంచి హుజూర్‌నగర్ వైపున్న సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్తున్న బొగ్గు లారీని ఓవర్‌టేక్ చేయబోయి 100 పడకల ఆస్పత్రి సమీపంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నాడు. అదే సమయంలో అటు వైపు వెళ్తున్న లారీ టైర్ల కింద పడ్డాడు. బైక్ వెనుక కూర్చున్న ప్రదీప్ తల పూర్తిగా ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న వ్యక్తి తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని...

బూర్గంపాడు: మండలంలోని నకిరిపేట గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. టేకులచెరువు గ్రామానికి చెందిన చింతనిప్పు మురళి(40) బైక్‌పై వెళ్తుండగా నకిరిపేట గ్రామం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ రాజేష్ సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని బూర్గంపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరిస్తా..



మాట్లాడుతున్న పొన్నం అశోక్‌గౌడ్

ఖమ్మంవన్‌టౌన్: న్యాయవాదుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కృషి చేస్తుందని టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ అన్నారు. ఆదివారం సంజీవరెడ్డిభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. న్యాయవాద రక్షణ చట్టం త్వరలోనే ఆమోదం పొందుతుందని, ప్రభుత్వం ద్వారా నియమితులయ్యే ఆడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, వివిధ పోస్టులను స్థానిక మంత్రుల సహకారంతో భర్తీ చేస్తామన్నారు. అర్హులైన న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తానని, 6 నెలల కిందట ఖమ్మం జిల్లా లీగల్‌సెల్ కమిటీ రద్దు అయిందని, త్వరలోనే కొత్త కమిటీని ప్రకటిస్తామని చెప్పారు. అనంతరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు మాట్లాడారు. సమావేశంలో టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ సింగం జనార్దన్, సీనియర్ న్యాయవాదులు గోవిందరావు, రావూరి నర్సింహారావు, బత్తుల బసవపున్నయ్య, కండె వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, గోపి, ఆవుల అనురాధ, వెంకటనారాయణ, వెంకీయనాయక్, మోజెస్ క్రిస్టఫర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోయచెలకలో వరి పంటల పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

రఘునాథపాలెం: మండలంలోని కోయచెలక గ్రామంలోని వరి పంటలను జిల్లా వ్యవసాయ శాఖాధికారి ధనసరి పుల్లయ్య పరిశీలించారు. ఓ కంపెనీకి చెందిన విత్తనాలను వేస్తే 30 ఎకరాల్లో వరి పైరు పిలక దశలోనే పొట్టకొచ్చిన విషయం విదితమే. వీటిని ఆదివారం డీఏఓ, ఖమ్మం డివిజన్ సహాయ వ్యవసాయ శాఖ ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. పిలక దశలోనే కంకులు రావడం గమనించామని, కారణాలు తెలుసుకోవడం కోసం యూనివర్సిటీ శాస్త్రవేత్తలను సంప్రదిస్తామని చెప్పారు. వరి పంటను వ్యవసాయ అధికారులతోపాటు బాధిత రైతులు, గ్రామ పెద్దలు సందర్శించారు.